క్లుప్తంగా

బుద్ధ జయంతి వేడుకలకు హాజరుకావాలని ఆహ్వానం



ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డికి ఆహ్వానపత్రిక అందజేస్తున్న వీరమల్లు, తదితరులు

నాగారం : రాష్ట్రంలోనే అత్యంత ప్రసిద్ధిగాంచిన ఫణిగిరి బౌద్ధక్షేత్రం వద్ద ఈ నెల 12న నిర్వహించే బుద్ధ జయంతి వేడుకలకు హాజరుకావాలని కోరుతూ గురువారం శాలిగౌరారంలో ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మందుల సామేల్‌కు బోధిసత్వ ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పులిగిల్ల వీరమల్లు యాదవ్ ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేందర్, బోధి సత్వ ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

హమాలీ యూనియన్ ఎన్నిక

అర్వపల్లి: కాసర్లపహాడ్ గ్రామంలో గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో హమాలీ యూనియన్‌ను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పస్తాల నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా బుషిపాక నరేష్, ప్రధాన కార్యదర్శిగా ఆర్. చిన్నసైదులు, కోశాధికారిగా బి. అశోక్, సహాయ కార్యదర్శిగా జానపాటి గోవర్ధన్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికను సీఐటీయూ జిల్లా నాయకుడు మచ్చ నర్సయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు.

నీటి తరలింపును ఆపాలి

పెన్‌పహాడ్ : చెరువులోని నీరు అక్రమ తరలింపును ఆపాలని కోరుతూ గురువారం రైతులు తహసీల్దార్ లాలుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మాచారం గ్రామ శివారు రావిచెరువులోని నీటిని కొంత మంది రైతులు మోటార్ల ద్వారా తమ సొంత వ్యవసాయ క్షేత్రాలకు తరలిస్తున్నట్లు తెలిపారు. నీటిని తరలించడం వల్ల భూగర్భజలాలు అడుగంటిపోయి, చెరువు కింద ఉన్న రైతుల బోర్లు ఎండిపోతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తూముల ఇంద్రసేనారావు, చింతరెడ్డి సుధాకర్‌రెడ్డి, కందిమళ్ల మధుసూదన్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, లక్ష్మీకాంతరావు, రమేష్, దామోదర్, వివేక్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని సూర్యానాయక్‌తండాలో లూనావత్ నర్సింహ అనే రైతుకు చెందిన గేదె గురువారం వ్యవసాయ బావివద్ద మేత మేస్తూ ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్ వైరుకు తగిలి మృతిచెందింది. ఈ గేదె సుమారు రూ.30 వేల విలువ చేస్తుందని బాధిత రైతు తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

సోమయ్య మృతి తీరని లోటు



చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఆత్మకూర్ (ఎస్) : కాట్ల సోమయ్య మృతి తీరని లోటు అని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం తుమ్మల పెన్‌పహాడ్ గ్రామంలో కల్లు గీత కార్మిక సంఘం నాయకుడు కాట్ల సోమయ్య సంతాప సభలో పాల్గొని మాట్లాడారు. కాట్ల సోమయ్య తన జీవిత కాలం మొత్తం గీత కార్మికుల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు తరపున పోరాటం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా కల్లు గీత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి మడ్డి అంజిబాబు, రాష్ట కామిటీ సభ్యులు అబ్బగాని భిక్షం, జిల్లా సహాయ కార్యదర్శి తండ రమేష్, జిల్లా నాయకులు నాగమల్లయ్య, సోమగాని మల్లయ్య, తండ చంద్రయ్య, యరగాని వెంకన్న, మామిడి లింగయ్య, కాట్ల సోమయ్య పాల్గొన్నారు.

మేడే వారోత్సవాలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కాసర్లపహాడ్ గ్రామంలో హమాలీ యూనియన్ నాయకులు గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో మేడే వారోత్సవం జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు మచ్చ నర్సయ్య, సకినాల జానయ్య, వేముల నర్సయ్య, పస్తాల నర్సయ్య, బుషిపాక నరేష్, రాజబోయిన చిన్నసైదులు, బొల్లం అశోక్, జానపాటి గోవర్ధన్, తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాలలో పోలీస్ భరోసా

అర్వపల్లి : యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని సూర్యాపేట డీఎస్పీ పార్థసారథి అన్నారు. జాజిరెడ్డిగూడెం మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన పోలీస్ భరోసా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రజల మార్పుకోసమే ఎస్పీ నరసింహ పోలీస్ భరోసా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా డీఎస్పీని గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాగారాం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్ఐ బాలకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎస్పీ పార్థసారథి

నత్తనడకన విస్తరణ పనులు

- అధ్వానంగా తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూరు–మోత్కూరు రోడ్డు
- పెద్దపెద్ద గుంతలు ఏర్పడి.. చిన్నపాటి వర్షానికే మోకాళ్ల లోతు నిలుస్తున్న నీరు
- ఇబ్బందులు పడుతున్న స్థానిక ప్రజలు, ప్రయాణికులు



తిరుమలగిరిలో మోత్కూరుకు వెళ్లే రహదారిపై నిలిచిన వర్షపు నీరు

తిరుమలగిరి : తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని మోత్కూరు–తొర్రూరు ప్రధాన రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. హైదరాబాద్ ఓఆర్ఆర్ గౌరెల్లి జంక్షన్ వద్ద నుంచి కొత్తగూడెం వరకు రహదారిని డబుల్ రోడ్డుగా నిర్మిస్తున్నారు. ఇందులో భాగంగా తిరుమలగిరి ఎక్స్ రోడ్డులో మోత్కూరు–తొర్రూరు రోడ్డుపై పనులను చేపట్టారు. రెండు సంవత్సరాల క్రితం పనులు ప్రారంభమైనా ఇప్పటి వరకు పూర్తి కాలేదు. ఎక్స్ రోడ్డు నుంచి రెండు వైపులా కిలో మీటరు వరకు డ్రెయినేజీ నిర్మాణాలు, రోడ్డు విస్తరణ కోసం తవ్వకాలు జరిపారు. అయితే పనులు వేగంగా పూర్తి కాకపోవడంతో పరిస్థితి అస్తవ్యస్తంగా మారింది. రోడ్డుపై ఒక్కో చోట మోకాళ్ల లోతు గుంతలు ఏర్పడటంతో వర్షానికి రోడ్ల పైనే నీళ్లు నిలుస్తున్నాయి. రోడ్లపై గుంతలు తెలియని వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. వర్షం వస్తే రోడ్డుపై బురద ఉండటంతో బాటసారులు నడవలేని పరిస్థితి నెలకొంటుంది. దీనికి తోడు ఈ రోడ్డుపై వందలాది వాహనాలు వెళ్తుండటంతో దుమ్ము విపరీతంగా లేస్తోంది. రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇళ్లలోకి, దుకాణాలలోకి దుమ్ము చేరుతోందని స్థానికులు వాపోతున్నారు.

తవ్వారు.. వదిలేశారు

రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్ల ముందు డ్రెయినేజీల నిర్మాణానికి జేసీబీలతో మట్టి తీశారు. అయితే పనులు నెలల తరబడి పూర్తి కాకపోవడంతో ఇళ్లలోని మురుగునీరు రోడ్డుపైకి చేరి దుర్గంధం వెదజల్లుతోంది. ఇళ్లలోకి నీటి సరఫరా జరిగే మంచి నీటి పైపు లైన్లు కూడా చాలాచోట్ల దెబ్బతిన్నాయి. దీంతో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. ప్రతిరోజు రహదారిపై ప్రజా ప్రతినిధులు, అధికారులు వెళ్తూ ఎవరూ తమ సమస్యను పట్టించుకోవడం లేదని స్థానిక ప్రజలు, ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

పునాది కూలిపోతుంది



రోడ్డు విస్తరణలో భాగంగా ఎనిమిది నెలల క్రితం ఇంటి ముందు వరకు మట్టిని తీశారు. అయితే ఇంట్లో మురుగు నీరంతా పైపు ద్వారా బయటకు రాక పునాదిలోకి వెళ్తోంది. పునాది కూలిపోతుందేమోనని భయపడుతున్నాం. ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియడం లేదు.

– సత్యనారాయణరెడ్డి, తిరుమలగిరి

ఇబ్బందులు పడుతున్నాం



రోడ్డు పనులు నత్తనడకన జరుగుతున్నాయి. రోడ్డు మీద పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి నీళ్లు నిలుస్తుండటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇళ్ల ముందు మట్టి తీయడంతో ఇళ్లలోకి వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నాం. పనులు వేగంగా పూర్తి చేయాలి.

– మల్లయ్య యాదవ్, తిరుమలగిరి





తిరుమలగిరిలో రహదారిపై ఏర్పడిన గుంతల్లో నిలిచిన వర్షపు నీరు



మట్టి తవ్వడంతో దెబ్బతింటున్న ఇంటి పునాది

ఘనంగా చెన్నకేశవస్వామి కల్యాణం



యజ్ఞోపవీతం చూపుతున్న అర్చకుడు

తాళ్లగడ్డ (సూర్యాపేట) : పిల్లలమర్రి శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో గురువారం ఏకాదశి సందర్భంగా స్వామి వారి మాస కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు ముదుంబై రఘువరన్ ఆచార్యులు మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో ఉత్తర ముఖం కలిగిన పురాతన ఆలయం పిల్లలమర్రిలో ఉండటం విశేషం అని అన్నారు. వైకుంఠంలో ఉత్తర ముఖం ద్వారా సాక్షాత్తు శ్రీమహా విష్ణువును ఏ విధంగా దర్శిస్తామో అదేవిధంగా ఇక్కడ ఆలయం కొలువు దీరి ఉంటుందని తెలిపారు. బావిలో వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామి గర్భాలయంలో భక్తులకు దర్శనం ఇస్తారని తెలిపారు. ఆలయంలో ప్రతి నెలా ఏకాదశి రోజున కల్యాణం, రోహిణి నక్షత్రం రోజున పంచామృత అభిషేకం, శుక్రవారం పుష్పాలంకరణ, రెండవ శనివారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ సహిత ఊంజల్ సేవ, మూడవ ఆదివారం శ్రీ సుదర్శన నారసింహ సహిత చెన్నకేశవ స్వామి హోమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గుకంటి రాజబాబు రెడ్డి, ధర్మకర్త ఉమ్మెంతల హరిప్రసాద్, భక్తులు ముదుంబై సారిక, గవ్వ విజయ లక్ష్మి, అంకం భిక్షం, మల్లీశ్వరి, గవ్వ అహల్య, మెరెడ్డి సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



సదస్సులో పాల్గొన్న గ్రీన్‌క్లబ్ సభ్యులు

సూర్యాపేట అర్బన్ : పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని గ్రీన్ క్లబ్ ఫౌండర్ ముప్పారపు నరేందర్, సభ్యుడు రామ చంద్రయ్య అన్నారు. గురువారం పట్టణంలోని బాలభవన్ సమ్మర్ క్యాంప్‌లో గ్రీన్ క్లబ్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడవద్దని తెలిపారు. మొక్కలను పెంచాలని, చేతి సంచి అలవాటు చేసుకుని కవర్ల వాడకం మానివేయాలని వివరించారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత అధ్యాపకుడు, కవి హమీద్ ఖాన్, బాలభవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణ రెడ్డి, సిబ్బంది దాసరి ఎల్లయ్య, సత్య నారాయణ సింగ్, ఉమ, అనిల్, సాయి, వీరయ్య, పద్మ తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే పథకాలు అందించాలని వినతి

అర్వపల్లి : ఇందిరమ్మ ఇళ్లు, రాజీవ్ యువ వికాసం పథకాల్లో అర్హులైన వారికే ప్రాధాన్యం ఇవ్వాలని కోరుతూ బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు చెర్కుపల్లి లక్ష్మణ్ అన్నారు. గురువారం అర్వపల్లిలో ఎంపీడీఓ గోపికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలో కాంగ్రెస్ వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని చెప్పారు. సిబిల్ స్కోర్‌తో సంబంధం లేకుండా రాజీవ్ యువ వికాసం పథకంలో అర్హులైన పేదలకు చేయూత అందించాలని విజ్ఞప్తి చేశారు. లేనిచో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జ్ ఎర్ర రాంబాబు, సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బుడిగ మల్లేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలి



రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ నరసింహ

చివ్వెంల : పోలీస్ స్టేషన్‌కు వచ్చిన ప్రతి ఫిర్యాదుపై త్వరితగతిన స్పందించాలని ఎస్పీ నరసింహ ఆదేశించారు. గురువారం చివ్వెంల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, ఫిర్యాదుల స్వీకరణ, రిసెప్షన్ మేనేజ్‌మెంట్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఫిర్యాదులపై ప్రాథమిక విచారణ పూర్తిచేయాలని, కేసుల నమోదులో జాప్యం చేయొద్దని సిబ్బందికి సూచించారు. ఏమైన సమస్యలు ఉంటే ఉన్నతాధికారుల దృషికి తీసుకురావాలని అన్నారు. డయల్ 100 ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. రాత్రి వేళలో పెట్రోలింగ్ పకడ్బందీగా చేయాలని తెలిపారు. జాతీయ రహదారి వెంట నిఘా పెంచాలన్నారు. రోడ్డు భద్రతపై, ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ప్రమాదాల నివారణకు కృషిచేయాలని సూచించారు. ఆయన వెంట ఎస్ఐ కనకరత్నం ఉన్నారు.

'సాక్షి' ఎడిటర్ ధనుంజయ రెడ్డి ఇంటిపై పోలీసుల దాడి తగదు



సూర్యాపేట అర్బన్ : మాట్లాడుతున్న నాయకులు



అర్వపల్లి : నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, సాక్షి అభిమానులు

సూర్యాపేట అర్బన్ : 'సాక్షి' ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఏపీ పోలీసులు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు మట్టిపల్లి సైదులు అన్నారు. గురువారం సూర్యాపేట పట్టణంలోని వాణిజ్య భవన్ వద్ద నిరసన తెలిపి విలేకరులతో మాట్లాడారు. సాక్షి ఎడిటర్ ధనుంజయ రెడ్డి నివాసానికి వెళ్లి భయభ్రాంతులకు గురిచేసిన ఏపీ పోలీసుల తీరును ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు. పత్రికా స్వేచ్ఛకు విఘాతం కలిగించే చర్యలకు ఏపీ ప్రభుత్వం పాల్పడుతోందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు జె.నరసింహారావు, నాయకులు చిన్నపంగ నరసయ్య, ప్రవీణ్, మురళి పాల్గొన్నారు.

సాక్షికి మద్దతుగా అర్వపల్లిలో నిరసన

అర్వపల్లి : ఏపీలో సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిపై పోలీసుల దాడిని నిరసిస్తూ అర్వపల్లిలో గురువారం రాత్రి స్థానిక జర్నలిస్టులు, సాక్షి అభిమానులు, యువకులు నిరసన వ్యక్తం చేశారు. నిజం రాస్తే కక్ష కట్టడం తగదన్నారు. ఏపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని తెలిపారు.

పేదల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే మందుల సామేల్



తుంగతుర్తిలో కల్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తోందని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం సన్న బియ్యం పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు. ఉచిత విద్యుత్ పథకం వల్ల పేదలపై ఆర్థికభారం తగ్గిందని తెలిపారు. గత ప్రభుత్వం ఏ ఒక్క పేదవానికి ఇల్లు ఇవ్వలేదని, కానీ తమ ప్రభుత్వం ఐదు లక్షల రూపాయల వ్యయంతో పేద ప్రజలకు ఇళ్లు మంజూరు చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, మార్కెట్ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, డీటీ కంట్లమయ్య, ఆర్ఐ శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బియ్యం సరఫరాలో విఫలం

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ఆర్భాటంగా గత నెలలో ప్రారభించిన సన్న బియ్యం పథకం మూణ్నాళ్ల ముచ్చటగా మారిందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తాడికొండ సీతయ్య అన్నారు. గురువారం బీఆర్ఎస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మండలంలో మెజారిటీ రేషన్ షాపులకు ఈ నెలకు సంబంధించిన రేషన్ బియ్యం సరఫరా జరగలేదని అన్నారు. ప్రభుత్వం ఏ ఒక్క పథకం కూడా సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపించారు. ఆయనతోపాటు బీఆర్ఎస్ జిల్లా నాయకుడు గుండగాని రాములు గౌడ్, తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



నాగారం : మామిడిపల్లిలో బడిబాటలో పాల్గొన్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



మద్దిరాల : చందుపట్లలో బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు, నాయకులు

నాగారం : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు సీహెచ్ యాకోబు అన్నారు. గురువారం మండల పరిధిలోని మామిడిపల్లి ప్రాథమికోన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాట్లాడారు. బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలతో కూడిన గుణాత్మక విద్య అందుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, రాగిజావ, మధ్యాహ్న భోజనం, రెండు జతల దుస్తులు అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు వి. వేణు, కె.అంజయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్దిరాల : ప్రభుత్వ బడుల్లోనే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందని ప్రధానోపాధ్యాయుడు ముజీబ్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చందుపట్ల గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పలు పార్టీల నాయకులను కూడా బడిబాట కార్యక్రమంలో భాగస్వాములను చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పచ్చిపాల వెంకన్న, మాజీ సర్పంచ్ కస్తూరి రాణి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ఎంపీపీ బెజ్జంకి శ్రీరాంరెడ్డి, మామిడి వెంకటయ్య, కొమ్ము వెంకన్న, సుధాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, సీతరాములు, కొమ్ము అంజయ్య, నర్సయ్య, రంగు జగన్, పరాల లింగయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం



తుంగతుర్తిలో సమ్మర్ క్యాంపును ప్రారంభిస్తున్న ఎంఈఓ లింగయ్య



అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎంఎన్ఓ ప్రభాకర్



తిరుమలగిరిలో శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న మండల విద్యాధికారి శాంతయ్య

తిరుమలగిరి : విద్యార్థులు వేసవి శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాధికారి శాంతయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దామెర శ్రీనివాస్, జానయ్య, వెంకన్న, సత్తిరెడ్డి పాల్గొన్నారు.

తుంగతుర్తి : సమ్మర్ ప్రత్యేక క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ బోయిని లింగయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపును ప్రారంభించి మాట్లాడారు. ఈ క్యాంపులో విద్యార్థులకు ఖోఖో, వాలీబాల్, హ్యాండ్ రైటింగ్, స్పోకెన్ ఇంగ్లిష్, కంప్యూటర్, డ్యాన్స్ వంటి వాటిలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ మే 25 వరకు కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు, ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లిలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేసవి వాలీబాల్ ఉచిత శిక్షణ శిబిరాన్ని గురువారం మండల నోడల్ అధికారి కుంభం ప్రభాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 రోజుల పాటు ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు శిబిరం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో శిబిరం ఇన్‌చార్జ్, వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.మల్లేష్, ఈద కోటిప్రసాద్, శరత్, ధోని, చింటు, మామిడి అరుణ, నర్సయ్య, నరేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పాకిస్తానీయులను బహిష్కరించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నాగారం : భారతదేశంలో అక్రమంగా నివాసం ఉంటున్న పాకిస్తానీయులను గుర్తించి, వారిని వెంటనే బహిష్కరించాలని గురువారం బీజేపీ నాయకులు నాగారం సీఐ రఘువీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం రాష్ట్ర కన్వీనర్ కన్నెబోయిన రాముయాదవ్, బీజేపీ మండల అధ్యక్షుడు కుంభం కర్ణాకర్ మాట్లాడారు. పాకిస్తాన్ దేశం ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తోందని అన్నారు. గ్రామ, మండల కేంద్రాల్లో మాక్‌డ్రిల్ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల కన్వీనర్ ఎల్లాచారి, నాయకులు నర్సింగ వెంకన్న, భాషబోయిన యాదగిరి, నీలం లింగయ్య, కన్నెబోయిన రాములు, పేరాల భాష, అంజయ్య, బుల్లెట్ల సురేష్, సతీష్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల పాదయాత్ర జయప్రదం చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్వపల్లి : తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆరు దశాబ్దాల పాటు పోరాటం సాగించిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించాలని కోరుతూ ఈ నెల 15న కర్విరాల కొత్తగూడెంలో మారోజు వీరన్న స్తూపం వద్ద నుంచి ప్రారంభమయ్యే పాదయాత్రను జయప్రదం చేయాలని ఆ సంఘం వ్యవస్థాపకుడు సామ అంజిరెడ్డి కోరారు. అర్వపల్లిలో గురువారం యాత్ర కరపత్రాలను తెలంగాణ ఉద్యమకారుడు దిర్శనపు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఉద్యమకారుడికి 250 గజాల ఇంటిస్థలం ఇవ్వాలని, రూ.25 వేల ఉద్యమ పింఛన్, హెల్త్‌కార్డులు, బస్‌పాస్‌లు ఇవ్వాలని కోరారు. ఈ యాత్ర హైదరాబాద్‌లోని గన్ పార్క్, ఉస్మానియా యూనివర్శిటీ వరకు కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు కొత్తగట్టు యాకన్న, దడిపల్లి వెంకట్, పోలెబోయిన కిరణ్, కె.కరుణాకర్‌రెడ్డి, కుంభం మదన్ మోహన్, కట్టెల మల్లేష్, ఎల్లేష్, బందెల వెంకన్న, తూటిపల్లి మల్లేష్, కనుకు నాగరాజు, మామిడి నర్సయ్య, మేకల నాగరాజు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

అర్వపల్లి : అర్వపల్లిలోని వైజంక్షన్‌లో పూలే, అంబేద్కర్, జగ్జీవన్‌రాంల విగ్రహాల ఏర్పాటుకు ఎమ్మెల్యే సామేల్ సహకారంతో గురువారం కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జీడి వీరస్వామి, ఉపాధ్యక్షులుగా బైరబోయిన మహరాజు, వేల్పుల రమేష్, దాసరి సోమయ్య, పి.సురేందర్, మాజీ సర్పంచ్ నర్సయ్య, మచ్చ నర్సయ్య, ప్రధాన కార్యదర్శులుగా వెంకటాద్రి, అవిలయ్య, యాదగిరి, సురేందర్‌నాయక్, ఈదుల అర్వపల్లి, బొడ్డు శంకర్, సహాయ కార్యదర్శులుగా కె.మల్లయ్య, నర్సింగ వెంకటేశ్వర్లు, రింగు సత్యం, ఎస్.మనోహర్, ఆర్ నరహరి, సంపత్, నాగరాజు, కార్యనిర్వహణ కార్యదర్శులుగా చిరంజీవి, మేడిపల్లి వేణు, నల్లగుంట్ల నాగేందర్, కోశాధికారిగా రవీందర్ ఎన్నికయ్యారు.

రోజుల తరబడి కేంద్రంలో నిరీక్షించలేక..

- మరో కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తరలిస్తున్న చిల్పకుంట్ల రైతులు



ధాన్యం లోడ్‌లతో వెళ్తున్న ట్రాక్టర్లు

నూతనకల్ : ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకుల అలసత్వం వల్ల రైతులు తమ ధాన్యాన్ని మరో ఐకేపీ కేంద్రాలకు తరలిస్తున్నారు. మండల పరిధిలోని చిల్పకుంట్లలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు ధాన్యం తీసుకొచ్చి నెల రోజులు దాటుతోంది. అయినా కాంటాలు వేయడంలో నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆందోళన చెందుతున్నారు. చివరకు రైతులు నూతనకల్ మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తరలించి అమ్ముకుంటున్నారు.